కథానిక

# వికల మనస్కుడు

"పుష్య"

ఆయనను యింతకు ముందెన్నడూ చూసినట్టు జ్ఞాపకంలేదు. కాని ఎందుకో ఆయనను చూడగానే ఎవరో ఆత్మబంధువును కలుసుకున్నట్లనిపించింది. బాగా ఆలోచించాను ఎక్కడైనా చూశానేమోనని, కాని లాభం లేకపోయింది. తదేక దీక్షతో చూస్తున్నాడాయన. నాతో మాట్లాడాలని అభిలాష పడుతున్నాడు. నేనూ ఆయనవేపు అలాగనే చూస్తున్నాను. హోటలులోకి వచ్చిన వాళ్ళందరూ ఎవరిమానాన వాళ్ళు ఫలహారాలుచేసి వెళ్ళిపోతున్నారు. మమ్మల్నెవరూ పట్టింపుగా చూడలేదు. నాకు చాలా దూరంలోనే కూర్చున్నాడు. చెయ్యితో సంజ్ఞచేసి దగ్గరకు రమ్మని పిలిచాడు. మేము కూర్చున్నది హోటలంతకూ ఒకమూల. మా దగ్గరగా ఎవరూ కూర్చోలేదు.

నలభైసంవత్సరాలకు పైబడివుంటుం దాయన వయస్సు. బట్టతల. పొట్టిమనిషి. శరీరమంతా ముడుతలు పడిపోయింది. కళ్ళు లోతుగా చొచ్చుకుపోయాయి. ఏదో మానసిక వ్యథతో కృంగిపోతున్నట్లున్నాడు. కొంతవరకు నాతో తెలివి తేటలతోనే మాట్లాడాడు. కాని కొంత వరకు పిచ్చిమనిషిలా వ్యవహరించాడు. తొడుక్కున్న నల్లకోటు బాగా చిరిగిపోయింది. చాలా మురికిగా వుంది. బొత్తాయిలన్నీ వూడిపోయాయి. వాటికి బదులు దారంతో కట్టుకున్నాడు. లోపల చొక్కా లేనేలేదు. కట్టుకున్న పంచకూడా మాసిపోయింది. మరకలతో నిండిపోయింది. గడ్డం బాగా పెరిగిపోయింది. ఏదో అసంతృప్తి కనుకొలకులనుంచి వుబుకుతోంది. పిచ్చివానిలాగ హోటలు లోపలిభాగమంతా కలయ చూస్తున్నాడు. ప్రతివాని ముఖంలోకి పట్టింపుగా చూస్తూ మళ్ళా అప్పటికప్పుడే భరింపరాని వ్యథతో కృంగిపోతున్నాడు. కొంతసేపటికి నావేపు చూసి ప్రారంభించాడు చెప్పడం.

'బాబూ, నన్నెరుగుదువు కదూ! ఎరగవూ! అవును నీకు తెలీను. చెప్పేదా నే నెవరినో! కోపంగా వుందా నేను నీతో మాటాడటం! లేదు, నీకు కోపంలేదు. నువ్వు చెప్పకపోయినా అదిగో నీకళ్ళే చెబుతున్నాయి. చదువుకున్న వాళ్ళంటే నాకెంతో గౌరవం. ఎంతో ముచ్చటేస్తుంది వాళ్ళనుచూస్తే, నువ్వు చదువుకుంటున్నావు కదూ. అందుకే నువ్వంటే నాకు యిష్టం. పెద్ద వుద్యోగం చేస్తున్నావా? గవర్నమెంటు వుద్యోగం. కాదు. కాదు...నువ్వు నువ్వు చదువుకుంటున్నావు కదూ. నా పేరు తెలుసా నీకు? తెలియదూ. పోనీలే. తెలియనక్కర లేదు. ఎందుకు తెలియాలి? తెలిసినందువల్ల ప్రయోజనం మాత్రం ఏమిటుంది.'

అని చెప్పి మీదకు చూసి ఏదో ఆలోచించ నారంభించాడు. కొంతవరకూ మాట్లాడలేదు. మళ్ళా చెప్పడం ప్రారంభించాడు.

'చదువుకుంటున్నానని కదూ చెప్పావు. నేనూ చదివాను. చాలా పుస్తకాలు చదివేను. స్కూలుకెళ్ళి కాదనుమీ. స్కూలుకెళ్ళి చదువుకోవాలనే వుండేది. డబ్బులేదు. అప్పుడే కాదు, ఇప్పుడూ లేదు. నేనూ తెలివైనవాడినే. కాకపోతే అన్ని పుస్తకాలు ఎలాగ చదువుతాను. నీకంటే తెలివైనవాడినే. నాకున్న లోకజ్ఞానం నీ కెక్కడుంది. వింటున్నావు కదూ' అని అంటూ వుండగానే గొంతుక బొంగురు పోయింది. గొంతుకు సవరించుకొని మొదలెట్టాడు.

'బాబూ! చెప్తాను వింటావు కదూ. నీ పేరేమిటో నాకు తెలియదు. చెప్పొద్దులే. నాకు తెలియనక్కరలేదు. నేను చెప్పేది మాత్రం వింటే అదే పదివేలు. దరిద్రం పాపమని కదూ అందరూ అనుకుంటున్నారు. అదెన్నటికీ కాదు. కాని యాచనమాత్రం మహాపాపం. దరిద్ర దశలో వ్యక్తిత్వాన్ని నిలబెట్టుకో వచ్చును.

కాని యాచనలోనో, ఎప్పటికీ కాదు. దరిద్రుడిని సంఘంనుంచి ఎవరూ తరిమెయ్యలేరు. ఒకటి మాత్రం నిజం. సంఘం ఉదాసీన పరుస్తుంది. కుమిలి, కుమిలి యేడ్చేటట్లు చేస్తుంది. 'నికృష్ట జీవి' అని వేలెత్తి చూపిస్తుంది. ఎత్తిపొడుపు మాటలంటుంది. నాకు తెలుసు. నే నాస్థితిలో వున్నాను కనుక నాకు తెలుసు. నీకు తెలుసునో తెలియదో నాకు తెలియదు.' అని బుఱ్ఱ దించుకున్నాడు. తలెత్తి చుట్టుప్రక్కల కూర్చున్న వాళ్ళ ముఖాల్లోకి పట్టింపుగా చూసేడు కొంత సేపటివరకూ. మళ్ళా ప్రారంభించాడు.

'సరదాకి నేనొక మాటడుగుతాను చెబుతావా? చూడూ. నువ్వెప్పుడైనా, పార్కులోని అరుగులమీదా, తాలూకా ఆఫీసు వరండాలలోనీ, దెయ్యాలు దేవుళ్లాడే సత్రపు అరుగులమీదా పడుకున్నావా? లేదూ! అందుకే నీకు దరిద్రమంటే ఏమిటో తెలియదు. నే నెప్పుడూ తాలూకా ఆఫీసు వరండాలోనే పడుకుంటాను ఇదిగో చూడు. ఈ కోటునున్న దుమ్మంతా ఆ వరండాదేను. రెండు సంవత్సరాలయింది నేను స్నానంచేసి. అప్పటివే యీ కోటూ, పంచానూ. ఈ నల్ల కోటు బావుంది కదూ. చాలా బావుంది. ఎక్కడిదో తెలుసా? నాకో మంచి స్నేహితు డుండేవాడు. వాడిచ్చే డిది నాకు. నే నడుక్కోలేదు సుమా. ఛీ! నా జన్మలో ఒకరిని అడుక్కుంటానా. అడుక్కోవడమంటే నాకు ప్రాణం పోతుంది. ఎందు కడుక్కోవాలి? వాళ్ళెవరు ఇవ్వడానికి? నేనడిగేవాడినీ వాళ్లిచ్చేవాళ్లూనా? ఎంత బావుంది. నే నడుక్కుంటే, 'అయ్యో పాపం' అని దయతలిచి, ఏమైనా నా కిస్తారుట. ఎవడిక్కావాలి వీళ్ళ దయ. నా కక్కరలేదు. నే నడగను, అన్నం లేకపోతే మాడిచస్తాను'

అని అంటూ పటపటమని పళ్లు కొరికాడు. చేతిని బల్లకేసి గట్టిగా కొట్టుకున్నాడు. ఎర్రగా చింత నిప్పుల్లాంటి కళ్లతో నావేపు చూశాడు. ఇదంతా నాకేమీ అర్థం కాలేదు. మా యిద్దరినీ చూసి ఆ చుట్టుప్రక్కల కూర్చున్నవాళ్లు గొల్లున నవ్వారు. ఎందుకు నవ్వారో నా కర్థం కాలేదు బహుశా వాళ్లకు ఆయనను తెలుసేమో అనుకున్నాను.

ఆయన చెప్పడం మొదలెట్టాడు. చెప్పబోయి లేచి ఎక్కడికో వెళ్ళిపోబోయాడు. మళ్ళా కూర్చుని చెప్పడం ప్రారంభించాడు.

'నే నెక్కడికో వెళ్ళిపోతున్నా ననుకున్నావు కదూ? నిజమే. ప్రతివాళ్లూ ఏదో చోటికి వెళ్ళాలి. ఎక్కడికి వెళ్ళడమో తెలియనివాళ్లకి వెళ్ళడం సాగదు. నే నెక్కడికి వెళ్లేది? నా కెవరూ ఎందుకు లేరూ? వున్నారు...ఉన్నారు నేనే వెళ్ళను వాళ్లదగ్గరకు. ఒకప్పుడు నావాళ్లే. ఇప్పుడు మాత్రంకారు. అదిగో, అటు చూస్తున్నావు. వాళ్లు నన్ను చూసి నవ్వుతున్నారని కదూ, నిజమే ... లోకంలో ఒకరి బ్రతుకు రెండవ వారికి నవ్వతాలుగా వుంటుంది. నాకు తెలుసు. మావాళ్ళ సంగతి నీకుచెప్పమన్నావా? అదిగో ఆ కనుపించే సందు చివరి యిల్లే మాది. అహా, కాదు...మా యిల్లుకాదు, నా భార్య యిల్లు. నా భార్య సంగతి చెప్పనా. పట్టుమని పట్టెడన్నం పెట్టలేదు ఎప్పుడూ దానికి. ఎప్పుడూ పస్తే. పస్తుకాకపోతే అన్నం మెక్కడ నుంచి వస్తుంది. నేనేమీ చదువుకోలేదే పని చెయ్యడానికి. పోనీ, నా ముద్దులరాణి ఇప్పుడు బాగా తింటోంది. కడుపునిండా తింటూన్నది. అప్పుడది అన్నంకోసం కుమిలి యేడ్వనిరోజుండేది కాదు. నా సంగతా? ఎప్పుడూ ఒకటే...

చూడునాయనా! నువ్వెప్పుడేనా చూశావా నా రాణిని? గుండ్రపాటి ముఖం, సోగకన్నులు, సంపెంగ పువ్వులాంటి ముక్కు, తెల్లటి శరీరం. అబ్బ ఎంత అందంగా వుంటుంది నా రాణి. ఇప్పుడు నారాణి కాదు. నా ప్రణయ సుందరి కాదు. అదంతా నాఖర్మ' అని అంటూ వుండగానే ఆయన కళ్ళంటనీళ్లు జొటజొట కారేయి. మీదికి తలెత్తి ఏమిటో దీర్ఘంగా చూశాడు. కొంతసేపు టేబిలుమీద తలను ఆనించి హోటలు నలుప్రక్కలా వెర్రిగా చూశాడు. మళ్ళా చెప్పడము ప్రారంభించాడు.

'మా పెళ్ళయిన క్రొత్తలో... అహా, మాకు పెళ్ళెక్కడయింది. అదికాదు. నారాణి నా వెనకాల వచ్చేసిన కొత్తలో కప్పుకుందికి దుప్పటి కొనమన్నది. చాలాకాలం కప్పుకున్నాం, అనుకుంటున్నావు కదూ. లేదు మర్నాడే వంటకి బియ్యం లేకపోతే అమ్మేశాం ఆ దుప్పటిని.

అదేలా కొన్నాననుకున్నావు. జేబు దొంగతనం చేసికొన్నాను. అప్పుడు నాకు తెలియదు దొంగతనం పాపమని. కాని యిప్పుడో ఇప్పుడన్నీ తెలుసు. అందుకే నేనేమీ చెయ్యలేదు.

బాబూ! నిన్ను పిలిచి నా సంగతంతా నవ్వుతాలకు చెబుతున్నా ననుకుంటున్నావు కదూ. ఎన్నటికీ కాదు. మరి దేనికనుకుంటున్నావు? నా కథ విని బాధపడేవాడు కావాలి. నా బాధను అర్థం చేసుకొనేవాడు కావాలి. అందుకే నిన్ను పిలిచాను. నా ఆవేదనను పంచుకునే విద్యావంతుడు కావాలి. తరువాత విను. నారాణి నాకెలా దొరికిందో చెప్పేదా. ఏదో వూరు దగ్గర పెద్ద తీర్థం జరిగింది. ఆ వూరు పేరు జ్ఞాపకం లేదు. తీర్థం చూడటానికి నేనూ వెళ్ళాను. అక్కడే నా రాణిని చూశాను. జోలి పట్టుకొని అడుక్కుంటోంది. పదిహేనేళ్లుంటాయప్పుడు. నన్ను చూడగానే నా దగ్గర కొచ్చింది. ఎంతో ఆప్యాయ్యంగా మాట్లాడింది. నా ముఖంలోకి ప్రశ్నార్థకంగా చూసింది. అంతే. నావెంట వచ్చేసింది. నారాణి. ఇప్పుడు నాకెదమైపోయింది నా రాణి. లేదు... లేదు. నేనే యెడమైపోయాను రాణికి. నన్ను చూసి ఎంతో ముచ్చట పడ్డది, అప్పుడు నేను తాగుతూ వుండేవాడిని అప్పుడప్పుడు. ఆ మైకంలో నా రాణిని చావమోదేవాడిని అన్నం పెట్టలేదని. ఇంట్లో బియ్యం లేకపోతే ఏం చెయ్యగలదు రాణిమాత్రం. పట్టుమని పది సంవత్సరాలయినా కాపురం చెయ్యలేదు. నా రాణికి దూరమైపోయాను.

'ఒకనాటి రాత్రి పెద్ద రభస జేసింది. ఒక పూటయినా పిడికెడు అన్నం పెట్టలేని భర్త ఏం భర్త అని తిట్టింది. నూతిలో గోతిలో దారి తీస్తానంది. ఆకలిబాధను భరించలేనంది. బావురుమని యేడ్చింది. నేనేం చెయ్యగలను. నిజమే నా రాణికి పిడికెడన్నం ఒకనాడైనా పెట్టిన పాపాన పోలేదు.'


అని గట్టిగా టేబిలుకేసి తలను గట్టిగా నాలుగుసార్లు కొట్టుకున్నాడు. రక్తం వచ్చిందేమోనని చూసుకున్నాడు. ఒక్కమారు హోటలు దద్దరిల్లేలాగ నవ్వాడు. 'నువ్వు నవ్వలేదేమి' అన్నట్టు నావేపు చూశాడు. తక్కిన వాళ్లందరూ నవ్వడం చూసి సంతృప్తిపడ్డాడు.

మళ్ళా విషాద ఛాయలు ఆయన ముఖాన్ని ఆవరించుకున్నాయి. కళ్ళంట నీళ్లు గిర్రున తిరిగాయి. చెబుతున్నాడు.

'నా దుస్థితి చూసి ఒక షావుకారుగారు లెక్కలు వెయ్యడానికి నన్ను కుదుర్చుకున్నారు. నెలకి ఐదురూపాయి లిస్తానన్నారు. నా రాణికి మంచి చీర, నాకొక పంచ, మేము పడుకోవడానికి మంచిచాప, కొనుక్కుందా మనుకున్నాను. అదిగో, అవన్నీ నేను కొనుక్కున్నా ననుకుంటున్నావు కదూ? భ్రమ, దృష్టిభ్రమ. నాచాత నెలంతా నానా చాకిరీ చేయించుకొని 'నీ కేం రాదు వెళ్ళవయ్యా, జీతం లేదు. నాతంలేదు' అన్నాడా ధర్మాత్ముడు. అహహ...నిజంగా ధర్మాత్ముడే గదూ ఆయన. ఎందుకో తెలుసా? జీవితంలో నేర్చుకోవలసిన మంచి విషయాన్ని ఆయన నాకు ధర్మంచేశాడు. అయితే ధర్మాత్ము డెందుకు కాడూ?'

అని చెప్పి నన్ను తెల్లగా చూశాడు. మిగిలినది కానియ్యండి అన్నట్టు చూశాను. ఆయన మళ్లా ప్రారంభించాడు.

'అదిగో, ఆ వీధి చివర యింటి కెప్పుడైనా వెళ్లేవా, అందులోనే వుంటున్నాది నా రాణి, అవును. అందులోనే. వెళ్ళలేదూ. అందుకే తెలీదు నీకు. ఈ వూళ్లోని మగాళ్లంతా ఆ యింటికే వెళతారు. నలుగురూ చెప్పుకోగా వినలేదూ నారాణిపేరు. పొట్టనిండా అన్నం లేదని ఆవృత్తి ప్రారంభించింది నారాణి. తప్పు కదూ నాయనా అపని చేయడం? తినడానికి అన్నం లేకపోతే ఆ వృత్తి అవలంబించాలా. ఎంతపాపం. ఎంతపాపం. నా యెదుటేనా. అయ్యో...ఏం...అంత ఆకలైతే ఏ నుయ్యో గొయ్యో చూసుకోగూడదూ. ఆ వృత్తినే చెయ్యాలా. నేనుండలేదూ ఆకలితో. చెప్పు. ఆ యింటికెళ్ళి చెప్పు. నారాణితో చెప్పు. అన్నం లేకపోతే పోయిందికాని ఆ వృత్తి మాత్రం మానెయ్యమని చెప్పు. చెప్తావుకదూ' అని వణుకుతున్న గొంతుకతో అన్నాడాయన. ఇంకా కళ్ళంట నీళ్లు కారుతున్నాయి. టేబిలువైపుకు తీక్షణంగా చూసి మళ్ళా నావైపు చూసేడు. ఆ చూపులో విషాదం, కోపం, అభిమానం మిళితమైఉన్నాయి.



పంజాబీ నర్తకి రేఖా మల్‌హోత్రా. క్రిందటివారం ఢిల్లీలో యీమె యిచ్చిన భరతనాట్య ప్రదర్శనం భరతనాట్య శాస్త్రాచార్యుల ప్రశంస నందుకున్నది. సుప్రసిద్ధ నాట్యాచార్యుడు శ్రీ గోవిందరాజ పిళ్లే యీమె గురువు.

'బాబూ, ఇదంతా నీకు నవ్వులాటగా కనిపిస్తుంది. వెక్కిరింపుగా వుంటుంది. నీకే గాదు. ఎవ్వరికైనా అంతే. నాకు మాత్రం కాదు. ఎన్నటికీ కాదు. నా ఆవేదనను పంచుకునే వాళ్ళు లేరు అందరూ వెక్కిరించేవాళ్ళే. నా జీవితంలో మధుర క్షణాలు దాటిపోయాయి. చీకటిలో తడుములాడి పోతున్నాను. నాకిక దారిలేదు. ఎన్నటికీ ముక్తిలేదు. అదిగో నన్ను చూసి జాలి పడుతున్నావు కదూ! ఎందుకు జాలి పడాలి? ఒకరి కరుణ నాకక్కరలేదు. ఒకరు నాపై జాలి చూప నక్కరలేదు. ఇంతకూ వాళ్లెవరు? మర్యాదస్తులైతే జాలి చూపుతున్నట్లు నటిస్తారు. కాని వాళ్ళయితే ముఖం ముందు నవ్వుతారు. ఇది పురస్కరించుకొని సమయ మొచ్చినప్పుడు ఎత్తి పొడుస్తారు. అంతే' అని ఆయన కళ్ళంట వచ్చేనీళ్ళను తుడుచుకున్నాడు. ఎప్పటివో రెండు పాత పేపర్లు చేతపుచ్చుకొని "మరొస్తా"నని లేచాడు. మా ప్రక్క కూర్చున్న వాళ్లు పకాల్న గొల్లున నవ్వారు. కొంతమారం వెళ్లి మళ్ళా ఆయన తిరిగి వచ్చాడు.

'మర్చిపోవుగదూ చెప్పడం. నా రాణితో చెప్పు వెళ్లి. యిప్పుడే వెళ్లు. అవృత్తి ఘోరపాప మని చెప్పు. వెంటనే మానెయ్యమని చెప్పు. చెప్తావు కదూ!'

అని చెప్పి హోటలునుంచి ఆయన వెళ్లి పోయాడు. ఇదంతా చూసిన నాకు మతి పోయింది. ఏమీ అర్థంకాలేదు. ఇంకా ఆయన కళ్ళంట కారే నీళ్లు కనిపిస్తున్నాయి. 'చెప్తావు కదూ' అన్నమాట యింకా చెవిలో గింగురు మంటూంది. ఆ ప్రక్క కూర్చున్న వాళ్లను వెర్రిగా చూశాను. మెల్లిగా వాళ్ళ దగ్గరికెళ్ళి 'ఎందుకు నవ్వుతున్నారని' అడిగాను.

'పిచ్చిదయ్యా, వాడు పిచ్చివాడు. అందరితోనూ అలాగనే చెబుతూ వుంటాడు. అందరినీ కనుపించే యింటికి వెళ్ళి చెప్పమంటాడు. ఆ పిచ్చివాడెప్పుడూ యిక్కడే తిరుగుతూ వుంటాడు. నీకు తెలియదూ.'

అన్నాడందులో ఒకాయన.